క్లుప్తంగా

ఆదిదంపతుల సేవలో మంత్రి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రిని ఆలయ ఈవో కేఎస్ రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన ఊంజల్ సేవ, సహస్ర దీపార్చన సేవలో పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో విశాఖ శారదాపీఠం పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి లోక రక్షణకు చేస్తున్న సేవలు నిరుపమానమని కొనియాడారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం స్వామివారి జన్మదినం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్‌లో దోమలు పెరుగుతున్న దృష్ట్యా స్థానిక కార్పొరేటర్, ప్రజల అభ్యర్థన మేరకు మలేరియా విభాగం సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. మురుగు కాలువల్లో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేశారు. అలాగే దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలను స్థానికులకు వివరించారు. బుడమేరులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ కళ్ళేపల్లి శేషంరాజు స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయం ఆధ్వర్యాన ముత్యాలంపాడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలక సంస్థ పాఠశాలలో విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎస్.కళ్యాణి నాగలక్ష్మి గ్రంథాలయ విశిష్టతను వివరించారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం పెంపొందించుకోవచ్చని తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాలపై అవగాహన పెంపొందించేందుకు పలు అవగాహన కార్యక్రమాలతో పాటు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీల ఆకస్మిక తనిఖీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మన బడి నాడు–నేడు పథకంలో మంజూరైన అదనపు తరగతి గదులను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కేజీబీవీ కార్యదర్శి డి మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఏ. కొండూరు, రెడ్డిగూడెం కేజీబీవీలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత ఏ. కొండూరు కేజీబీవీని సందర్శించి విద్యార్థుల నోటు పుస్తకాలను, వర్క్ బుక్స్ పరిశీలించారు. సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. అనంతరం రెడ్డిగూడెం కేజీబీవీ సందర్శించి ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలను, టీచింగ్ డైరీలను పరిశీలించారు. 17మంది విద్యార్థుల గైర్హాజరుకు కారణాలు ఆరా తీసి ప్రిన్సిపల్‌ను మందలించారు. తనిఖీల్లో ఏడీ జి.నాంచారయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలోని నాగేంద్రునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయంలో కొలువైయున్న నాగేంద్రస్వామిని దర్శించుకుని పాలు, పండ్లు, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు కాశీవిశ్వేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని నాగేంద్రస్వామికి పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగేంద్రుని కృపా కటాక్షాలతో రాష్ట్రంలోని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో పాటు డెప్యూటీ మేయర్ అవుతు శైలాజరెడ్డి, ఆలయ ఈఓ సుపద్మాదేవి, చైర్మన్ కొల్లూరు రామకృష్ణలు ఉన్నారు.



వీర నాగేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాగుల చవితి వేడుకులను భక్తులు భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. భక్తులు విశేష సంఖ్యలో పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. నాగేంద్రస్వామి పుట్టలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు స్వామివారికి ఇష్టమైన పాలు, చిమిలి, తదితర పూజా సామాగ్రితో నాగేంద్రస్వామి పుట్టల వద్ద బారులు తీరారు.

ముత్యాలంపాడులో.....

స్థానిక ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన జంట నాగులకి విశేష అభిషేకం చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని నాగేంద్రస్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి పాలు పోశారు.

హనుమాన్‌నగర్‌లో.....

స్థానిక హనుమాన్‌నగర్‌లోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద ఎర్రుబోయిన అర్జునరావు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని పూలు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నాగేంద్రస్వామివారికి పూజలు చేశారు.

అయోధ్యనగర్‌లో.....

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శ్రీ ధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

శ్రీబాల సుబ్రమణ్యేశ్వరస్వామి దేవాలయంలో.....

మధురానగర్‌లోని శ్రీబాల సుబ్రమణ్యేశ్వరస్వామి దేవాలయంలో బోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాగుల చవితి వేడుకులు ఘనంగా జరిగాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పాలు పోసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్థానిక విజయదుర్గా నగర్, గద్దే వెంకట్రామయ్య నగర్, దావు బుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాల్లోని పుట్టల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి పాలు పోశారు.

అజిత్‌సింగ్‌నగర్‌లో....

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక అజిత్ సింగ్‌నగర్ నాగేంద్రస్వామివారి దేవాలయంలో నాగుల చవితి వేడుకల్లో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ముఖ్య అతిథిగా పాల్గొని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఎండీ హఫీజుల్లా, భక్తులు పాల్గొన్నారు.



పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

61వ డివిజన్‌లో....

పాయకాపురం(విజయవాడరూరల్): 61వ డివిజన్ ప్రశాంతినగర్‌లో నాగేంద్రస్వామి గుడివద్ద భక్తులు ఉదయం నుంచి పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. శాంతినగర్‌లోని నాగేంద్రస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో నాగేంద్రస్వామికి పూజలు చేసి పుట్టలో పాలు పోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

లెనిన్‌సెంటర్‌లో...

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్‌సెంటర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా– నాగమానసాదేవి మందిరంలో ఆలయ వ్యవస్థాపకుడు సుధాస్వామి ఆధ్వర్యంలో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జంట నాగుల విగ్రహాలను పాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. సూర్యారావుపేటలోని కోర్టుల భవనం వద్ద ఉన్న అమ్మవారి ఆలయంలోనూ నాగుల చవితి వేడుకలు నిర్వహించారు.



ప్రశాంతినగర్‌లో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

పింక్ టాయిలెట్ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): మహిళల కోసం, మహిళలతో నిర్వహించేదే ఈ పింక్ టాయిలెట్స్‌ని చాలా మంది మహిళలు, మహిళా ఉద్యోగస్తులు, ప్రయాణికులు, విద్యార్థినిలకు సౌకర్యవంతంగా ఉంటుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద నిర్మించిన పింక్ టాయిలెట్‌ను వీఎంసీ ఆధ్వర్యంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, సబ్ కలెక్టర్ అదితిసింగ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జనసాంద్రత అధికంగా ఉండే బెంజిసర్కిల్ వద్ద ఇది ఏర్పాటుచేయడంతో చాలా మంది మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చాలా మంది మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందని, ఇందులో మరుగుదొడ్లు, చేంజింగ్ రూమ్, పాలిచ్చే తల్లులకు ఫీడింగ్ రూమ్, శానిటరీ వెండింగ్ మెషిన్ లో కేవలం ఐదు రూపాయలు పెడితే మూడు శానిటరీ నాప్కిన్స్ వచ్చే సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. నవంబర్ 19 ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఈ మూడు రోజులు మరుగుదొడ్లకు వాటి వాడకంపై ప్రజలందరికీ తెలియజెప్పాలని ఉద్దేశంతో శుక్రవారం ఉదయం పింక్ టాయిలెట్‌ను ప్రారంభించామన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకించి ఒక టాయిలెట్స్‌ని రూ.20 లక్షలతో నిర్మించడం, వాళ్ళ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకించి రూములు గదులను కేటాయించారన్నారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకించి ఒక టాయిలెట్ కల్పించడం అనేది ఒక మంచి ఆలోచనని, మహిళలు అందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు షహీన బేగం, ప్రవల్లిక, నిర్మల కుమారి, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సైరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఏఎస్ఎన్ ప్రసాద్, చంద్రశేఖర్, మారిస్ స్టెల్లా కాలేజీ ఉపాధ్యాయురాలు స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



బెంజిసర్కిల్ వద్ద పింక్ టాయిలెట్లను ప్రారంభిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ దుర్గ, తదితరులు

భగవాన్ సత్యసాయి సర్కిల్‌గా సీతారామపురం జంక్షన్

వీఎంసీ గెజిట్

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలో సెంట్రల్ నియోజకవర్గంలోని సీతారాంపురం జంక్షన్‌ను భగవాన్ శ్రీ సత్యసాయి జంక్షన్‌గా నామకరణం చేస్తూ వీఎంసీ శుక్రవారం గెజిట్ విడుదల చేసింది. అక్టోబర్ 31వ తేదీన జరిగిన వీఎంసీ కౌన్సిల్లో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అజెండాలో ప్రతిపాదన చేయగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలపగా శుక్రవారం దీనిపై ఉత్తర్వులు వెలువడ్డాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు విద్యుత్ సెక్షన్ శ్రీనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ ఒకటోరోడ్డు నుంచి 5వ రోడ్డు వరకు, టీచర్స్‌కాలనీ ఒకటోరోడ్డు నుంచి మూడో రోడ్డు వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుందన్నారు.

ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య విద్య శాఖలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి) ప్రభుత్వ దంత వైద్య కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగ నియామకాలు జరపనున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు www.smcvja.in వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఆ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

పటమట(విజయవాడతూర్పు): ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సూచనలకు అనుగుణంగా రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల వద్ద సైన్ బోర్డ్స్ ఏర్పాటుచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో రోడ్ల వెంట అక్రమ ఆక్రమణలు తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో ఉన్న అన్ని బస్సు షెల్టర్లను మున్సిపల్. ఏపీఎస్‌ఆర్టీసీ, పోలీస్ శాఖల సమన్వయంతో తనిఖీ చేయాలని చెప్పారు. అవసరమైతే కొత్త షెల్టర్లు ఏర్పాటు చేయాలని, బస్ స్టాప్ ల వద్ద ఆక్రమణలు తొలగించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలకు దారి తీసే హోర్డింగ్‌లను గుర్తించి వాటిని తీసేయాలని తెలిపారు. సమావేశంలో ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ యం. వై. దానం, ఆర్ అండ్‌బీ డీఈ డి.యస్.యస్.ప్రసాద్, నేషనల్ హైవే ఇంజినీర్ యం.వి. నాగేశ్వరావు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ డి.ప్రసాద్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్– చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ జీ.వి.జీ.ఎస్.వి ప్రసాద్, డీసీపీ జుబిన్ సైరన్ రాయ్, డీసీపీ–1 భాస్కర్ బాబు, ఏసీపీ పి.మోహన్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.నారాయణ మూర్తి, వి. శ్రీనివాస, వి.చంద్రశేఖర్, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్– వి.నరసింహమూర్తి పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాద చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బీసీలపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్

పటమట(విజయవాడతూర్పు): బీసీలు గురించి మాట్లాడే నైతిక అర్హత టీడీపీకి లేదని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో బీసీల మీద దాడులు పెరిగాయని టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. విజయవాడలోని ఆర్టీసీ కాలనీలోని సంఘం కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీసీలకు వెన్నుదన్నుగా, వెన్నెముకగా నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలిచిందన్నారు. దీంతో రాజకీయ ఉనికి కోల్పోతున్న ప్రతిపక్షాలు బీసీలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి దూరం చేయాలనే దురాశతో మాట్లాడున్నాయని దుయ్యబట్టారు. రాజ్యసభ సీట్లను రూ.వందల కోట్లకు అమ్ముకున్న చరిత్ర చంద్రబాబునాయుడుదని గుర్తు చేశారు. అదే రాజ్యసభ సీట్లను బీసీలకు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దని వివరించారు. 92 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో బీసీ కులగణనకు అంకురార్పణ చేసిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంపూర్ణ ఆరోగ్యకర సమాజ స్థాపనే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందజేస్తున్నారని ఏపీ ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 29వ డివిజన్ మధురానగర్ 210వ వార్డు సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష శిబిరం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నాడు–నేడు ద్వారా వైద్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావటం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు, కె.సుధాకర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో.....

30వ డివిజన్ 247వ వార్డు సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరంను ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. నాయకులు తుంపాల వరప్రసాద్, సీహెచ్ సుబ్బారెడ్డి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

26వ డివిజన్‌లో....

26వ డివిజన్ 31వ వార్డు సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరంను ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి అంగిరేకుల నాగేశ్వరరావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

36వ డివిజన్‌లో....

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 36వ డివిజన్ గాంధీనగర్ రామకోటిగుడి రోటరీ కళ్యాణమండపంలో 192వ వార్డు సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా, కార్పొరేటర్ గోవింద్ పాల్గొన్నారు.

25వ డివిజన్‌లో....

25వ డివిజన్ అరండల్‌పేటలోని 95వ వార్డు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా, స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతల పాల్గొన్నారు.

మరోసారి జనరంజక పాలన తథ్యం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనను మరోసారి నిండు మనసుతో ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 58వ డివిజన్ 239వ వార్డు సచివాలయ పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజాతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం నిర్వహించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లగల్గుతున్నామని మల్లాది విష్ణు అన్నారు. ఈ సందర్భంగా వైవీ రావు ఎస్టేట్ నుంచి ఇందిరానాయక్ నగర్ వరకు పరిసర ప్రాంత ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ. 4.16 కోట్లతో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణం, రూ. 3.61 కోట్లతో చేపట్టిన పంపింగ్ మెయిన్ పైపులైన్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలియజేశారు.

ప్రతిపక్షాలు భయపడుతున్నాయి:

2024 సార్వత్రిక ఎన్నికలంటేనే టీడీపీ, జనసేన, బీజేపీ భయపడుతున్నాయని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి బీజేపీ చలవేనంటూ పురంధేశ్వరి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజాబలంతో సీఎం వైఎస్ జగన్ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఈఈ(ఇంజనీరింగ్) శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, ఉమ్మడి వెంకట్రావు, కష్ణమోహన్, వసంత్, శర్మ, గోపిరెడ్డి, వరలక్ష్మి, శోభన్, మారుతి, మహేశ్వరి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్ ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

మహిళాభ్యుదయంతో దేశ ప్రగతి

విజయవాడ కల్చరల్: మహిళాభ్యుదయంతోనే దేశ ప్రగతి సాధ్యమని ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ అన్నారు. ఎక్స్‌రే సాహిత్య సేవాసంస్థ, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సొసైటీ సర్వీస్ ఆధ్వర్యంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో శుక్రవారం 'నా విజయంలో జీవిత భాగస్వామి' ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జమల పూర్ణమ్మ మాట్లాడుతూ మహిళా ప్రగతిని స్వాగతించాలని సూచించారు. సభాధ్యక్షుడు బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ దేశ ప్రగతిలో మహిళల పాత్ర విస్మరించలేనదని ప్రతి మగవాని జీవితంలో మహిళలు పాత్ర ఉంటుందన్నారు. ఠాగూర్ గ్రంథాలయ అధికారి రమాదేవి, లయన్స్ క్లబ్ దుర్గాతేజా అధ్యక్షురాలు దుంపల లక్ష్మీకుమారి జ్యోతిని వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. వాకర్స్ జిల్లా గవర్నర్ డీవీఎస్ రామలింగరాజు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలోఅభిప్రాయాలను తెలియజేసిన 25 మంది దంపతులను నిర్వాహకులు సత్కరించారు.



సభలో మాట్లాడుతున్న జమల పూర్ణమ్మ, బోడి ఆంజనేయరాజు, రామలింగరాజు, లక్ష్మీకుమారి తదితరులు

ఆదాయ లక్ష్యాలను అధిగమించాలి

జేటీసీ శివరామ ప్రసాద్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రవాణా శాఖ పరంగా నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను అధిగమించాలని జేటీసీ ఎస్. శివరామప్రసాద్ సిబ్బందికి సూచించారు. త్రైమాసిక పన్నుల బకాయిలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. శుక్రవారం బందర్ రోడ్డులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో జేటీసీ శివరామ ప్రసాద్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వాహనాల త్రైమాసిక పన్నుల ఎగవేతదారులపై ఆరా తీశారు. పన్నులు చెల్లించని వాహనాల జాబితాల ప్రకారం ప్రాంతాల వారీగా తనిఖీలు చేపట్టాలని, అటువంటి వాహనాలను సీజ్ చేయాలని ఆయన ఆదేశించారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వాహనాలపై నమోదు చేసిన కేసుల నుంచి జరిమానాలు, త్రైమాసిక పన్నులు, పెనాల్టీలు రూ.47 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాహనాల తనిఖీ సమయంలో అధికారులపై దుర్భాషలాడటం, దురుసుగా ప్రవర్తించడమనేది నేరమని, తనిఖీ అధికారులతో ఏదైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని వాహనదారులకు సూచించారు. సమావేశంలో డీటీసీ ఎం. పురేంద్ర, ఇన్‌చార్జ్ ఆర్టీఓ ఆర్. ప్రవీణ్, మోటార్ వాహన తనిఖీ అధికారులు రాంబాబు, రమణ, జీవీఎస్ఎస్ మూర్తి, వెంకటేశ్వర రావు, ఎంవీఎస్ రాజు, కార్యాలయ ఏవో అబ్దుల్ సత్తార్, చంద్రకళ, ఎం. రాజుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేటీసీ శివరామప్రసాద్

దంత సంరక్షణపై శ్రద్ధ పెట్టాలి

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన సదస్సు, చదరంగ పోటీలు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న దంత వైద్యుడు సీహెచ్ నారాయణరావు మాట్లాడుతూ మనిషి ఆరోగ్యం దంతాల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతి రోజూ రెండు పూటలా దంతాలు బ్రష్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యుడు నారాయణ రావును సత్కరించారు. అనంతరం విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి, డి.రమేష్, కె.రాంబాబు, జె.శంకర్, కుమార్, ఫణిబాబు పాల్గొన్నారు.



దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నారాయణరావు